క్లుప్తంగా

శివకుమారికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ విభాగం పరిశోధకురాలు బైరపాక శివకుమారికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అట్రాసిటీస్ ఆన్ ఉమెన్ ఇన్ తెలంగాణ యాస్ రెఫ్లెక్టెడ్ ఇన్ కాంటెంపరరీ తెలుగు లిటరేచర్ – ఏ స్టడీ (1911 – 1948) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శివకుమారికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సదానందం పర్యవేక్షణలో శివకుమారి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



హన్మకొండ: ఆశ్రమ, వీధి బాలుర ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద ఆటో డ్రైవర్ల పిల్లలకు హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగులు, బధిరుల ఆశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. రన్ ఆర్గనైజేషన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితా రెడ్డి నోట్‌బుక్స్ అందించారు. కార్యక్రమంలో రన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ప్రియాంక, శ్రీకాంత్, స్పందన ఆశ్రమ బాధ్యురాలు సుచరిత, వసుధ, హరిత పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావుకు సన్మానం

కాజీపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఈవీ.శ్రీనివాస్‌రావును హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఘులాం అఫ్జల్ బియాబాని (జనాబ్ ఖుస్రుపాషా) కాజీపేట దర్గాలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు బట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ పాల్గొన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌కు..

కాజీపేట రూరల్: ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నమిండ్ల శ్రీనివాస్‌ను రైల్వే నాయకులు, కరాటే మాస్టర్లు పాశం దేవయ్య, బాల్నె రవీందర్, రేణికుంట్ల దుర్గప్రసాద్ ఆదివారం సన్మానించారు. కోమటిపల్లిలో స్వగృహంలో శ్రీనివాస్ దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

'భద్రకాళి' పాలక మండలి సభ్యులకు..

కాజీపేట: భద్రకాళి దేవస్థాన పాలకమండలి సభ్యులుగా ఎన్నికైన పాలడుగుల ఆంజనేయులు, ఓరుగంటి పూర్ణచందర్‌ను రజక సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలోని మడేలయ్య గుడిలో సోమేశ్వర రజక సహకార సంఘం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో పాలడుగుల అనిల్, కుమారస్వామి, హరికిషన్, రామస్వామి, ఉపేందర్, సదానందం, సుధాకర్, శివకుమార్, జాకీ, రవి పాల్గొన్నారు.

పాటల పోటీలు



నయీంనగర్: భువన సుస్వర మ్యూజిక్ అకడమీ హనుమకొండ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఐడల్ స్టేట్ లెవల్ సోలో, కారోకెలో సింగింగ్ పాటల పోటీలు ఆదివారం నిర్వహించారు. జడ్జిగా మ్యూజిక్ డైరెక్టర్ ప్రణీల్ వ్యవహరించారు. కార్యక్రమంలో 100 మంది సింగర్స్ పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మ్యూజిక్ అకడమీ ఫౌండర్ భువన, సింగర్ రాహుల్, తిరుపతయ్య, గజవెల్లి శ్రీనివాస్, ఉపేంద్ర, జ్యోతి, పూజారి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు సహకరించాలి



కాజీపేట: రెడ్డి కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డిని నగరానికి చెందిన రెడ్డి సంఘం సభ్యులు హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బద్దురి వెంకటేశ్వర్ రెడ్డి, చందుపట్ల నర్సింహా రెడ్డి, నల్ల సంజీవ రెడ్డి, మాధవ రెడ్డి, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, రామిరెడ్డి, సంతోష్ రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగుకు భరోసా

రైతులకు పెట్టుబడి సాయం అందించిన ప్రభుత్వం

- 1,56,403 మంది ఖాతాల్లో రూ.162.38 కోట్లు జమ
- వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల చుట్టూ తప్పిన ప్రదక్షిణలు
- వరంగల్ జిల్లాలో 3,08,320 ఎకరాల్లో వివిధ పంటల సాగు



చేనులో విత్తనాలు నాటుతున్న కూలీలు



ఖిలా వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం రైతులకు అందించింది. వరంగల్ జిల్లాలోని 1,56,403 మంది రైతుల ఖాతాల్లో విడతల వారీగా రూ.162.38 కోట్లు జమ చేసింది. ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా అందడంతో పంటల సాగుపై వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సీజన్‌కు ముందుగానే పెట్టుబడి సాయం అందడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో 3,08,320 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. వరి 1,43,803 ఎకరాలు, మొక్కజొన్న 9,820 ఎకరాలు, పత్తి 1,26,173 ఎకరాలు, కంది 1,180 ఎకరాలు, మిర్చి 9 వేల ఎకరాలు, పసుపు 950 ఎకరాలు, ఇతర పంటలు 17, 400 ఎకరాల్లో సాగవుతున్నాయి.

సాగు ప్రారంభంలోనే ..

సాగు పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. దుక్కులు దున్నడానికి, విత్తనాలు విత్తేందుకు పెట్టుబడి కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తప్పింది. బంగారు ఆభరణాలు సైతం కుదువపెట్టి అప్పులు తేవాల్సి వచ్చేది. ఈ ఏడాది ఆ ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేయడంతో రైతుల మోముల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. చాలా చోట్ల పత్తి విత్తనాలు విత్తగా కొన్ని చోట్ల కలుపు తీస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక పోవడంతో వరిసాగు పనులు ఆలస్యమవుతున్నాయి. పచ్చిరొట్ట విత్తనాలు వేశారు. వర్షాలు పడి చెరువులు, జలాశయాలు నిండితే నార్లు పోయనున్నారు. ముందుగా బావుల కింద ఇప్పటికే నార్లు పోసి నాట్లు వేయటం ప్రారంభించారు. జిల్లాలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు అందుకున్న 2,203 మంది రైతులు నుంచి ఈనెల 20 వరకు వ్యవసాయ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వీరి వివరాలను మండల వ్యవసాయ కార్యాలయాల్లో అధికారులు నమోదు చేశారు. త్వరలో వీరి ఖాతాల్లోనూ రైతు భరోసా డబ్బులు జమకానున్నాయి.

ప్రతీ సీజన్‌కు రైతు భరోసా..



జిల్లాలో మొత్తం 1,56,403 మంది రైతుల ఖాతాల్లో రూ.162.38 కోట్లు జమయ్యాయి. కేవలం కొద్ది రోజుల్లోనే ఇంత పెద్ద మొత్తంలో అందించింది. ఈసారి విత్తనాలు, ఎరువులు, కూలీలు, ఇతర పంటల పెట్టుబడికి ఈ డబ్బులు రైతులకు భరోసా నిచ్చాయి. అలాగే, ప్రతీ సీజన్‌కు రైతు భరోసా సాయం జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– అనురాధ జిల్లా వ్యవసాయ అధికారి

మండలాల వారీగా రైతు భరోసా జమ ఇలా (రూ.కోట్లలో)

మండలం	రైతులు	నగదు
చెన్నారావుపేట	11,407	10.92
దుగ్గొండి	14,375	13.11
ఖానాపురం	8,656	8.78
నల్లబెల్లి	13,444	14.26
నర్సంపేట	11,914	9.75
నెక్కొండ	14,819	14.98
గీసుకొండ	12,950	12.58
ఖిలా వరంగల్	4,891	4.14
పర్వతగిరి	14,211	16.27
రాయపర్తి	19,289	24.09
సంగెం	14,846	15.03
వరంగల్	1,716	1.44
వర్ధన్నపేట	13,885	17.03
	1,56,403	162.38

నాకు భరోసా నిచ్చింది..



నాకు కాట్రపల్లి గ్రామంలో 1.17 ఎకరాల భూమి ఉంది. ఆభూమిలో ఏటా వరి సాగు చేస్తున్నా. రైతు భరోసా సాయం కింద 1.17 ఎకరాలకు రూ.8,550 బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. రెండేళ్లుగా సకాలంలో పెట్టుబడి రాక వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల్లో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి వరి సాగు చేశా. ఈ ఏడాది సకాలంలో రైతు భరోసా అందడంతో నేను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డా. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశా. నేను కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లప్పుడు రుణపడి ఉంటా.

– ఉమాదేవి మహిళా రైతు, కాట్రపల్లి, సంగెం మండలం

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



స్థల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

కాజీపేట రూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. జాంబవ సంఘం భవన నిర్మాణానికి స్థలం కొనుగోలుకు ఆర్థిక సాయం చేసినందుకు హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకుడు సిరిల్‌లారెన్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను జాంబవ మాదిగ సంక్షేమ సేవా సంఘం కమిటీ సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, దొంగల కుమారస్వామి, అరుంధతి మాదిగ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయ్‌భాస్కర్, పోగుల శ్రీనివాస్, జాంబవ సంఘం అధ్యక్షుడు ఇమ్మడి రవి, ప్రధాన కార్యదర్శి సిలువేరు మల్లికార్జున్, కోశాధికారి గబ్బెట ఎల్లేష్, మాలతి, రేణుక పాల్గొన్నారు.

ఆషాఢ మాస గోరింటాకు వేడుక

వరంగల్ చౌరస్తా: వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుకను ఆదివారం జరుపుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో అధ్యక్షురాలు కళావతి నేతృత్వంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఆషాఢ మాసంలో గోరింటాకు కార్యక్రమం ఐదేళ్లుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంటి ఆడబిడ్డలకు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టడం తమ సంప్రదాయం అని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గార్లపాటి శ్రీలత, కోశాధికారి తాటిపల్లి రాజమణి, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ తాటిపల్లి సుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సంపూర్ణ, గట్టు ధనలక్ష్మి, అల్లాడి వనజ, రజిత, రమాదేవి, పెండ్యాల వాసవి, వీరమని వాసవి, గిరిజ, సుకన్య, కావ్య పాల్గొన్నారు.

'చలో ఈదుముడి'కి తరలిరావాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) ఆధ్వర్యంలో జులై 7న ప్రకాశం జిల్లాలోని ఈదుముడిలో నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలో ఈదుముడి వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజల న్యాయ హక్కుల కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించేందుకు చలో ఈదుముడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఫోరం బాధ్యులు తక్కళ్లపెల్లి రాజేందర్, బొల్లెపాక రాజేష్, మైలారపు ప్రేమ్‌కుమార్, కరుణాకర్, అశోక్, పెండ్యాల సుమన్, కుమ్మరి ముకేష్, బొట్ల సదానందం, లంక స్వామి, సిరిసిల్ల అనిల్, కొడెపాక భాస్కర్, ప్రసాద్, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగండి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా మురళి

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

వరంగల్ అర్బన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులకు ఎల్లవేళలా తాను తోడుగా ఉంటానని, అధైర్య పడకుండా సమన్వయంతో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు భరోసా ఇచ్చారు. వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, పురోగతి, ప్రస్తుత పరిస్థితులను సంఘం కార్యదర్శి మాదారపు రాజేశ్వర్ రావు వివరించారు. సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు అనారోగ్యంతో మూడు నెలలుగా సంఘం కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. అనంతరం, కొండా మురళి మాట్లాడుతూ ఆర్యవైశ్య సభ్యులకు ఏమైనా సమస్యలుంటే గట్టు మహేష్ బాబును ఆశ్రయించాలని, ఇకనుంచి ఆయన ఆధ్వర్యంలో కార్యకలపాలు కొనసాగాలని సూచించారు. గత కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థిక కార్యకలపాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ నియమించారు. సమావేశంలో బ్రహ్మదేవర సోమలింగం, తోట సంపత్ కుమార్, తాటికొండ చక్రపాణి, మునుగోటి రమేష్, రజినీకాంత్, తాటికొండ రాములు, ఈశ్వరయ్య, మంచాల కృష్ణమూర్తి, గౌరిశెట్టి శ్రీనివాస్, ఎలగందుల రమేష్ పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను వినియోగించుకోవాలి

విద్యారణ్యపురి: బహుళ జాతి సంస్థల ఉత్పత్తులను బహిష్కరించాలని, స్వదేశీ వస్తు వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేయాలని దక్షిణ భారత క్షేత్ర సయోజక్ మానవీయ జగదీష్ కోరారు. హనుమకొండలోని జైభారత్ జూనియర్ కళాశాలలో స్వదేశీ జాగరణ మంచ్ విభాగ్ స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఉత్పత్తుల ప్రాధాన్యతను పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వివరించాలన్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. విదేశీ మాల్స్, మార్ట్‌లలోని వస్తువులను త్యజించాలని ఆయన సూచించారు. స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర బాధ్యులు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా యువ ప్రముఖ్ గడ్డం శరత్‌చంద్ర, బాధ్యులు గుజ్జుల రామచంద్రం, సతీష్, అర్జున్, మహేందర్, వికాస్, యోగా గురువు భాస్కర్, పునీత్, రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల (1989 – 90 ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం స్థానిక బాలాజీ గార్డెన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు రాంనర్సింహాచార్యులు, రుద్రయ్య, సమ్మిరెడ్డి, రహీం, నారాయణ, సాంబయ్య, పట్టాభి, శ్రీరాంరెడ్డి, శ్రీధర్‌రాజు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెమీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న టి.లింగారెడ్డి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, డైట్‌లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకులు డాక్టర్ ఎం.గంగాధర్, డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు జి.ఉప్పలయ్య, కె.శ్రీనివాస్, కె.యాకయ్య, ఎ.గోవిందరావు, ఇతర బాధ్యులు సుభాషిణి, అంజనీదేవి, సుమ, మహేందర్ రెడ్డి, రవీందర్, జాన్‌నాయక్, కొమ్మాలు, సారయ్య, ఆనందచారి, రామస్వామి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



నాయకులతో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుదామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని స్వగృహంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అరెస్టు అక్రమని, ఆయన అరెస్టును ఖండించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన క్రమంలో గురుకులాలు, పాఠశాలల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించాలని విద్యార్థి నాయకులకు సూచించారు. గురుకులాలు, వివిధ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను ఎత్తిచూపుతూ, ఆయా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుదామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ పరంగా విద్యా కమిటీలను సైతం ఏర్పాటు చేద్దామని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న కేంద్రీయ విద్యాసంస్థలు, ఇతర విద్యాసంస్థల సాధన కోసం ఉద్యమించాలని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు శరత్‌చంద్ర, రంజిత్, రాకేష్ యాదవ్, శ్రీకాంత్ చారి, అనిల్, శ్రవణ్, స్నేహిత్, ప్రణయ్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

రామన్నపేట: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని గుమస్తాల సంఘం కార్యదర్శి గున్నాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. జులై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులతో కలిసి వరంగల్‌లోని వ్యాపారులకు ఆదివారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులకు ఈ నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదాని, అంబానీలాంటి కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. కార్మికులంతా ఈ విషయాన్ని గ్రహించి సమ్మెలో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, సహాయ కార్యదర్శి సింగారపు బాబు, జిల్లా కమిటీ సభ్యులు అప్పాజీ వాణి, మడెద్ల ఉపేందర్, ఏరియా కమిటీ సభ్యులు మహబూబ్ పాషా, మురళి, గోపాల్, రాజు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

హన్మకొండ: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దేశ వ్యాప్తంగా జూలై 9 జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాంచందర్ పిలుపునిచ్చారు.

పోతన రోడ్డులో భారీ గుంతలు



గుంత వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

రామన్నపేట: నగర మేయర్ గుండు సుధారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్ డివిజన్‌లోని పోతన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు అన్నారు. ఈ క్రమంలో చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మేరకు పార్టీ రామన్నపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గుంతల రోడ్డుపై ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని రెండేళ్లుగా అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. మేయర్, ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్, పులిమాటి శివ, రాజేష్, కొమురయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే గార్డుల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ప్రభురాజ్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ హెడ్‌క్వార్టర్ బ్రాంచ్ చైర్మన్‌గా, రైల్వే సీనియర్ ప్యాసింజర్ గార్డుగా ఇ.నర్సింగరావు, సీనియర్ గూడ్స్ గార్డుగా, రైల్వే సంఘ్ ఆఫీస్ బేరర్‌గా జి.రమేష్.. రైల్వేశాఖకు, రైల్వే కార్మికులకు అందించిన సేవలు అభినందనీయమని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి.ప్రభురాజ్ కొనియాడారు. మయూరి గార్డెన్‌లో నర్సింగరావు, రమేష్ పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారిని వారిని సన్మానించారు. తొలుత సంఘ్ కార్యాలయంలో కాజీపేట అన్ని బ్రాంచీల ఆఫీస్ బేరర్లు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కాజీపేటలోని రైల్వే కార్మికుల సమస్యలను ప్రభురాజ్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం, రైల్వే క్రూ లాబీని సందర్శించి లోకోపైలెట్ల సమస్యలపై చీఫ్ క్రూ కంట్రోలర్‌తో చర్చించారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, ఏరియా ఇన్‌స్పెక్టర్ రాజీవ్ చౌదరి, రైల్వే సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ వేగి మురళి, సీడబ్ల్యూసీ మెంబర్ ఎస్.వెంకట నారాయణ, సంఘ్ నాయకులు నాగరత్నం, పాక రాజ్‌కుమార్, బల్వీందర్ సింగ్, కె.రవి, ముస్తాక్, యాకూబ్‌పాషా, మాధవరావు, నారాయణ, మధుసూదన్, కోటేశ్వర్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

డిప్యూటీ జైలర్ వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ మామునూరు ప్రాంగణంలోని సెంట్రల్ జైల్‌లో డిప్యూటీ జైలర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన శెంకేసి వెంకటేశ్వర్లు వివిధ హోదాల్లో 40 ఏళ్లపాటు సేవలందించి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మామునూరు ప్రాంగణంలోని సెంట్రల్ జైల్‌లో ఆదివారం పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు నాలుగు దశాబ్దాల పాటు నిజాయితీగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరస్వామి, జైలర్లు పూర్ణచందర్, గోపిరెడ్డి, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.